క్లుప్తంగా

పొలాల వద్దే పంట నమోదు


వీఎస్ఆర్ పేటలో పంట నమోదు చేస్తున్న ఏఓ

నగరి : పంట సాగు చేస్తున్న రైతుల వద్దకే వెళ్లి పంట నమోదును వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ చేపట్టారు. మున్సిపల్, మండల ప్రాంతాల్లో 2746 ఎకరాలు వ్యవసాయ భూమి ఉండగా 1,593 ఎకరాలు సాగులో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ భూముల్లో ఇప్పటివరకు 1,130 ఎకరాలు మాత్రమే నమోదు చేయడం జరిగిందన్నారు. ఖరీఫ్ 2023 సంబంధించి పంట నమోదు చేసుకుని రైతులు ఈ నెల 15వ తేదీలోపు రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బందిని కలిసి పంట నమోదు చేసుకోవాలన్నారు. ఆర్బీకే సిబ్బంది ఈ పంట నమోదు చేయడం జరుగుతుందన్నారు. పంట నమోదు చేసుకున్న వారు మాత్రమే ప్రభుత్వం ద్వారా అందించే పథకాలకు అర్హులవుతారని చెప్పారు.

108 వాహనంలో ప్రసవం


శిశువును బంధువులకు అప్పగిస్తున్న 108 సిబ్బంది

గంగాధరనెల్లూరు : మండలంలోని తూగుండ్రం పంచాయతీ తొప్పనపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ 108 వాహనంలో కాన్పు అయింది. జయంతి(32)కి బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రసవ నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి ఫోన్ చేశారు. 10 నిమిషాల్లో 108 వాహనం అక్కడికి చేరుకుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే జయంతికి నొప్పులు మరింత తీవ్రం కావడంతో సిబ్బంది అక్కడే కాన్పు చేయడంతో మగశిశువు జన్మించింది. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని 108 వైద్యాధికారి సందీప్, పైలట్ బాబు తెలిపారు. అనంతరం తల్లీబిడ్డను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించినట్లు చెప్పారు.

ముగిసిన ఎస్వీ శిల్ప కళాశాల వర్క్‌షాప్

తిరుపతి కల్చరల్: ఎస్వీ సంప్రదాయ శిల్ప శిక్షణ సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు చక్కటి ఉపాధి పొందేలా కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకునేలా చర్యలు తీసుకుంటామని టీటీడీ జేఈవో సదా భార్గవి తెలిపారు. సంప్రదాయ ఆలయ శిల్పకళలు–అనుబంధ అంశాలపై మూడు రోజులు జరిగిన వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఇందులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మూడు రోజులు వర్క్‌షాప్‌లో వివిధ రాష్ట్రాల నుంచి విచ్చేసిన నిష్ణాతులు విద్యార్థులకు శిల్పకళలో మెళకువలపై అవగాహన కల్పించారని తెలిపారు. భవిష్యత్తులో ఏడు రోజుల వర్క్‌షాప్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. 3డీ యానిమేషన్ డిప్లొమా, సాయంత్రం కోర్సులు ప్రవేశపెట్టాలని విద్యార్థులు కోరారని, వీటిపైనా ఆలోచిస్తామని తెలిపారు. మహాబలిపురానికి చెందిన స్థపతి టి.కదిరివన్ దారు శిల్పం తయారీలో సాంకేతిక అంశాలు అనే అంశంపై, బెంగళూరుకు చెందిన గోపాలక్రిష్ణ హంపిలోని విజయనగర రాజుల కాలంనాటి దేవాలయ శిల్పకళ అనే అంశంపై ఉపన్యసించారు. తిరుపతి వేదిక్ వర్సిటీ వైఖానస ఆగమ విభాగం అధ్యక్షుడు టి.బ్రహ్మాచార్యులు వేదాలు, ఆగమాలు, భారతీయ సంస్కృతి, సనాతన ధర్మం, మైసూరుకు చెందిన స్థపతి టి.దేవేంద్ర ఆచారి దేవాలయాలు, శిల్పాలపై 3డీ విజువలైజేషన్ అనే అంశాలపై అవగాహన కల్పించారు. టీటీడీ విద్యాశాఖాధికారి భాస్కర్‌రెడ్డి, ఎస్వీ ఆయుర్వేద ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్, కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో బర్డ్ అభివృద్ధి

తిరుపతి తుడా: అత్యుత్తమ వైద్య ప్రమాణాలతో బర్డ్ ఆస్పత్రిని అభివృద్ధి చేస్తున్నట్లు టీటీడీ జేఈవో సదాభార్గవి చెప్పారు. ఆమె బుధవారం వైద్యులు, అధికారులతో కలిసి బర్డ్ ఆస్పత్రిని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అనేక మంది వైద్య నిపుణులు ఇక్కడికి వచ్చి పేదలకు మోకీలు, తుంటి మార్పిడి ఆపరేషన్లను ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. అంతకుముందు బర్డ్ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సదుపాయాలు, వైద్య సేవలను పరిశీలించారు. అత్యవసర వార్డు, జనరల్ వార్డు, ఎక్స్ రే, స్కానింగ్, ఓపీ వార్డుల్లో పలు సూచనలు చేశారు. అనంతరం డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది సమస్యలను తెలుసుకున్నారు. బర్డ్ ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, డాక్టర్లు వేణుగోపాల్, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

గంగమాంబపురంలో పుష్పపల్లకిపై స్వామివారు



ప్రత్యేక అలంకరణలో ఉభయదేవేరులతో..



పుత్తూరు గీతామందిరంలో..



విశేషాలంకరణలో శ్రీకృష్ణుడు



బృందా విహారీ.. రారా మా ఇంటికి ఒకసారి

- అట్టహాసంగా కృష్ణాష్టమి వేడుకలు
- ఆకట్టుకున్న శ్రీకృష్ణ, గోపిక వేషధారణలు



గీతామందిరంలో శ్రీకృష్ణుడి దర్శనానికి వేచి ఉన్న భక్తులు, ఉట్టికొడుతున్న యువకులు


స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఉభయదారులు

నగరి : మండలంలోని నంబాకం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సెలువరోజు అయినా స్థానికంగా ఉన్న విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి పాఠశాలలో పండుగను జరుపుకున్నారు. శ్రీకృష్ణ, గోపిక వేషధారణలతో పాఠశాలలో ఆటపాటలతో కేరింతలు కొట్టారు. పండుగ విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు తెలియజేశారు. పలు ప్రాంతాల్లోని ఇళ్లలో గోకులాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నారులు గోపిక, చిన్నికృష్ణుడి వేషధారణల్లో ఆకట్టుకున్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలవ్యాప్తంగా బుధవారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. వేకువజామున నుంచే శ్రీకృష్ణుడి ఆలయంలో అర్చకులు కృష్ణాష్టమి కార్యక్రమాలు ప్రారంభించారు. గ్రామాల్లో చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపిక వేషధారణలో శ్రీకృష్ణుడి ఆలయానికి వెళ్లారు. కృష్ణాష్టమి సందర్భంగా గొల్లకండ్రిగ, గంగమాంబపురం బీసీ కాలనీలో గ్రామస్తులు స్వామివారిని నూతన పట్టు వస్త్రాలు, విశేష పుష్పాలతో అలంకరించారు. సాయంత్రం స్వామివారిని వివిధ సుగంధ పుష్పాలతో పల్లకిలో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి, పురవీధుల్లో ఊరేగించారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళలు శ్రీకృష్ణుడికి టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి మొక్కుకున్నారు.

శ్రీకృష్ణుడి ఆలయంలో ..

నగరి : మండలంలోని వీకేఆర్ పురం గ్రామంలోని రాధారుక్మిణీ సమేత శ్రీకృష్ణ ఆలయంలో కృష్ణాష్టమి పూజలు వైభవంగా జరిగాయి. ఆలయాన్ని పుష్పాలతో అలంకరించారు. స్వామివారికి పట్టువస్త్రాలు, పూలమాలలతో నేత్రపర్వంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం వద్ద ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించగా భక్తులు దర్శించుకుని కర్పూరహారతులు ఇచ్చారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పుత్తూరు పట్టణంలోని శ్రీకృష్ణ మందిరంలో బుధవారం కృష్ణాష్టమి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలువురు చిన్నారులను చిన్నికృష్ణుడి వేషధారణలతో మందిరానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. గీతా పారాయణం చేశారు. సాయంత్రం భజనలు, రాత్రి 10 గంటలకు శ్రీకృష్ణ జననం, ఉయ్యాలసేవ నిర్వహించారు. పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరాలయం, శ్రీషిర్డీ సాయిబాబా ఆలయాల్లోనూ కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు, పూజలు జరిగాయి. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం : మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలో వెలసిన శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల సన్నిధిలో బండి సభాపతిరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమానికి భారతంమిట్ట గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు.


గోపికల వేషధారణలో విద్యార్థులు


బాలకృష్ణులుగా విద్యార్థులు


కాకవేడులో ఆకట్టుకున్న గోపిక, చిన్నికృష్ణుడు


గోపిక వేషధారణలో చిన్నారి

వ్యవసాయానికి భరోసా

వరుణుడి కరుణతో పాటు ప్రభుత్వం చేయూత కూడా తోడవడంతో అన్నదాత ఇంట ఆనందాల పంట పండుతోంది. సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందుతోంది. పైసా ప్రీమియం చెల్లించకుండానే పంటలకు బీమా సదుపాయం లభిస్తోంది. ఉన్న ఊర్లోనే వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలు అందుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి సరికొత్త వ్యవసాయ విప్లవానికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికింది.

- రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న రాష్ట్రప్రభుత్వం
- దేశానికే ఆదర్శంగా రైతు భరోసా కేంద్రాల సేవలు
- వ్యవసాయాన్ని పండుగ చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి


ఎస్‌కేఆర్ పురం ఆర్‌బీకేలో రైతు భరోసా పథకం అర్హుల జాబితాను ప్రదర్శిస్తున్న సిబ్బంది (ఫైల్)


శ్రీకావేరిరాజుపురంలో రైతుభరోసా కేంద్రం

పాలసముద్రం : గతంలో రైతులు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి లేదంటే నియోజక వర్గ కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేది. అయితే వాటికి చెక్ పెడుతూ రాష్ట్రప్రభుత్వం రైతులకు వ్యయ ప్రయాసలు లేకుండా గ్రామాల వారీగా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామం వదలి బయటికి రావాల్సిన అవసరం లేకుండా అన్ని రకాల సేవలు వీటిల్లో లభిస్తున్నాయి. ఆర్బీకేల ఏర్పాటుతో వ్యవసాయ, ఉద్యాన, ఫిషరీష్, పట్టుపరిశ్రమశాఖ, ఏపీఎంఐపీ తదితర ప్రభుత్వ విభాగాల సేవలన్నీ అందుతున్నాయి. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు నిర్దిష్టమైన ధరలకే లభ్యమవుతున్నాయి. పొలంబడి కార్యక్రమాలు ఈ–క్రాప్ బుకింగ్, అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఏర్పడినప్పుడు పంట నష్టం ఎన్యూమరేషన్ తదితర కార్యక్రమాలన్నీ ఆర్‌బీకేల ద్వారానే జరుగుతున్నాయి. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో ధరలు లేనప్పుడు రైతు భరోసా కేంద్రాల వారీగా మద్దతు ధర ఇచ్చి రాష్ట్రప్రభుత్వం కొనుగోలు చేస్తోంది.

ఉచితంగా పంటల బీమా సదుపాయం..

రైతులకు ఉచితంగా పంటల బీమా సదుపాయం కల్పించడం పెద్ద ఊరటనిస్తోంది. టీడీపీ హయాంలో బీమా మొత్తాన్ని 2 నుంచి 5 శాతం ప్రీమియం చెల్లించాల్సి వచ్చేది. అయినప్పటికీ పరిహారం తూతూమంత్రంగా వచ్చేది. ప్రస్తుతం నోటిఫై చేసిన పంటలు ఈ–క్రాప్‌లో నమోదైతే చాలు వైఎస్సార్ ఉచిత పంటల బీమా అందుతుంది. రైతులు ఒక్క రూపాయి ప్రీమియం చెల్లించకపోయినా రాష్ట్ర ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇస్తుంది.

పెట్టుబడి కష్టాలు లేవు



రాష్ట్రప్రభుత్వం రైతు సంక్షేమానికి పెట్టపీట వేస్తోంది. వైఎస్సార్ రైతు భరోసా పథకం అమలు చేస్తుండడంతో అన్నదాతలకు పెట్టుబడి కష్టాలు తొలిగాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా రబీలో వేరుశనగ సాగు చేసే రైతుకు సబ్సిడీపై విత్తనాలను అందజేస్తున్నారు. రైతులను రాజులను చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం గొప్ప విషయం.

– శేఖర్‌రాజు, తొట్టికండ్రిగ, రైతు

వ్యవసాయం పండుగ అవుతోంది



ప్రభుత్వం వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటోంది. గతంలో రైతుల పరిస్థితి ఏమాత్రం బాగా లేదు. వరుస కరువుతో అల్లాడి పోయాం. నాలుగేళ్లగా రైతుల పరిస్థితి కుదుటపడుతోంది. వర్షాలు బాగా పడుతున్నాయి. ప్రభుత్వం కూడా ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది. పంటలకు రూపాయి ఖర్చులే కుండా ఉచిత పంట బీమా సదుపాయం కల్పిసోంది. గ్రామాల వారీగా కస్టమ్స్ హియరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి యాంత్రీకరణను అందుబాటులోకి తెచ్చింది.

– సి.లక్ష్మి, శ్రీకావేరిరాజుపురం

రైతుల పక్షపాతి సీఎం జగన్



రైతు భరోసా పథకం సొమ్ము బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. పెట్టుబడులకు చేదోడుగా ఉంది. పంట నష్టపోయిన సమయంలో పంటల బీమా, నష్టపరిహారం ఎప్పటికప్పుడు అందడంతో ఆర్థికంగా నిలబడగలిగాం. రైతు పక్షపాతి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాం.

– కే.రాజేంద్రన్, శ్రీకావేరిరాజుపురం, రైతు

గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు



గత ప్రభుత్వాలు రైతుల గురించి పట్టించుకోలేదు. నాలుగేళ్లు ఏటా రైతు భరోసా డబ్బు బ్యాంక్ అకౌంట్లో జమవుతున్నాయి. ఖరీఫ్ ప్రారంభంలో ప్రభుత్వం చేస్తున్న సాయం సేద్యం ఖర్చులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం మాట తప్పని నేతగా సీఎం జగన్ చేస్తున్నారు.

– జి.మహేష్‌బాబు, రైతు

వాణిజ్య, భౌతికశాస్త్రంలో పీహెచ్‌డీలు



ఉమామహేశ్వర్, హరిహరన్

పుత్తూరు రూరల్: స్థానిక శ్రీవిద్యా డిగ్రీ కళాశాల చైర్మన్ జి.ఉమామహేశ్వర్‌కు భౌతిక శాస్త్రం, కామర్స్ విభాగ అధిపతి బి.ఎం.హరిహరన్‌కు వాణిజ్య శాస్త్ర విభాగంలో అన్నామలై యూనివర్సిటీ పీహెచ్‌డీ డిగ్రీలు ప్రదానం చేసింది. ఉమామహేశ్వర్ అన్నామలై యూనివర్సిటీ భౌతిక శాస్త్రం ప్రొఫెసర్ వి.రామస్వామి, ఎస్వీయూ భౌతికశాస్త్రం ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు సంయుక్త పర్యవేక్షణలో నియోడైమియం, యూరోపియం అయాన్స్‌దోపెడ్ ఫ్లోరోబోరేట్ అండ్ నియోడైమియం, యుటర్బియం డోపెడ్ సిలికేట్ గ్లాసెస్ ఫర్ లేజర్ డిస్ప్లే డివైజెస్ అప్లికేషన్స్ (లేజర్ కాంతి పరికరాల ఉపయోగాలు) అనే అంశంపై జరిపిన పరిశోధనలకు గానూ పీహెచ్‌డీ ప్రదానం చేశారు. హరిహరన్ అన్నామలై యూనివర్సిటీ అధ్యాపకులు టీకే సెంథిల్‌కుమార్, ఎస్వీయూ అనుబంధ నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ అధ్యాపకులు డి.భాస్కర్ సంయుక్త పర్యవేక్షణలో తిరుపతి తిరుమల దేవస్థానం అందిస్తున్న సేవలపై భక్తుల మనోభావాలు–సంతృప్తి అనే అంశంపై జరిపిన పరిశోధనలకు పీహెచ్‌డీ ప్రదానం చేశారు.

కౌమార దశలో ఆరోగ్యంపై శ్రద్ధ వహించండి


వైద్యసిబ్బందికి సూచనలు ఇస్తున్న హెల్త్ ఎడ్యుకేటర్ గుణశేఖర్

నగరి : కౌమార దశలో ఉన్న బాలికల ఆరోగ్య పరిస్థితిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా ఆరోగ్య విద్యాధికారి గుణశేఖర్ అన్నారు. బుధవారం బుగ్గ అగ్రహారం ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందికి, ఆశావర్కర్లకు ఆయన మాతృ ఆరోగ్య శిశుసంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమార బాలికల ఆరోగ్యానికి తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. బాల్యవివాహం అరికట్టడం గురించి విశదీకరించారు. క్షయ, కుష్టు నిర్మూలనకు తీసుకోవలసిన చర్యలను తెలియజేశారు. టొబాకో వాడడం వల్ల కలిగే పరిణామాలను వివరించి వాటి వాడకాన్ని నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. జిల్లా స్టాటిస్టికల్ అధికారి జార్జ్, పబ్లిక్ హెల్త్ నర్సు రేణుకప్రభ తదితరులు పాల్గొన్నారు.

రోజమ్మ మేలు మరువం


పుత్తూరు ఆస్పత్రిలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు రూరల్: కడుపు నిండా భోజనం పెడుతున్న మంత్రి రోజమ్మ రోజు మేలు ఎప్పటికీ మరువమని గర్భిణులు అన్నారు. నగరి, పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రులకు ప్రతి బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. పరీక్షల నిమిత్తం వేచివుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. బుధవారం చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు వెజిటబుల్ పలావ్, వైట్ రైస్, గుడ్డు, కరీస్, పచ్చడి, సాంబారు, రసం, పెరుగు అన్నం, చిక్కీ, అరటిపండును అందించారు. కార్యక్రమంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్ నారాయణస్వామి, పుష్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనుల పరిశీలన


జగనన్న లేఅవుట్‌లో గృహనిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్‌కుమార్

పాలసముద్రం : గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ప్రేమ్‌రాజ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన పాలసముద్రం దళితవాడ సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్‌లో చేస్తున్న గృహనిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన లబ్ధిదారులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహనిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం ఉచితంగా ఇసుక, తక్కువ ధరకే సిమెంట్, సకాలంలో బిల్లులు ఇస్తోందన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు అవగాహన కల్పించి పనులు పూర్తి చేయించాలని సూచించారు. ముఖ్యంగా జగనన్న లేఅవుట్‌లో తాగునీరు, రోడ్డు, విద్యుత్ కొరతలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ దాము, సూపర్‌వైజర్ బాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ అక్షయ్, పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి


కొత్తఇండ్లు గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటుకు వీధులను పరిశీలిస్తున్న బాలాజీ

కార్వేటినగరం: మండలంలోని ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎల్ఆర్ పేట పంచాయతీ కొత్త ఇండ్లు గ్రామంలో సీసీ రోడ్డు ఏర్పాటు కోసం వీధులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో సీసీ రోడ్లు లేని గ్రామాలను అధికారులు పరిశీలించి రోడ్లు వేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవతో 85 శాతం సీసీ రోడ్లు, బీటీ రోడ్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సీసీ రోడ్ల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న గ్రామాలను ఎంపిక చేసి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అలాగే ఆయన జగన్నాథపురం ఎస్టీ కాలనీ రోడ్డును పరిశీలించారు. ఆయన వెంట మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ మురగయ్య, మాజీ సర్పంచ్ అంకయ్య, అమ్మపల్లి సర్పంచ్ ధనశేఖర్‌వర్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చందురాజు, మణి, జేజేలురెడ్డి, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై అవనాక్షమ్మ


సింహవాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

నారాయణవన: సముదాయంలోని టీటీడీ అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయ వార్షిక జాతరలో భాగంగా బుధవారం రాత్రి అమ్మవారు సింహ వాహనాన్ని అధిరోహించి సముదాయం పురవీధుల్లో విహరించారు. గత నెల 22వ తేదీ మంగళవారం సాయంత్రం వార్షిక జాతర సందర్భంగా ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. 15 రోజుల పాటు నిర్వహించే ఈ జాతరలో చివరి మూడు రోజుల పాటు అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. బుధవారం ఉదయం ఆలయంలో అర్చకులు శుద్ధి, తోమాల తదితర నిత్య కైంకర్యాలను పూర్తి చేశారు. 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. పలువురు మహిళలు పొంగళ్లు పెట్టి, పిండి దీపారాధన సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సర్వాంగ సుందరంగా సుగంధ పుష్పాలు, స్వర్ణాభరణాలతో అమ్మవారిని అలంకరించి సింహవాహనంపై అధిష్టింపజేశారు. అనంతరం అమ్మవారు సముదాయం పురవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. గురువారం రాత్రి అమ్మవారు సముదాయం, నారాయణవనం ఎగువ, దిగువ శెంగుంధర్ వీధుల్లో అమ్మవారి ఊరేగింపు చేపడుతున్నట్లు నాగరాజు తెలిపారు. చివరి రోజైన శుక్రవారం రాత్రి సముదాయం, కీళగరం, నారాయణవనంలో అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం, నాగరాజు, భద్రతా జమేదార్ రాజశేఖర్ ఉత్సవాలను పర్యవేక్షించారు.

పద్మావతీ వెంకన్నలు కొలిచిన అవనాక్షమ్మ

పద్మావతీ అమ్మవారి తండ్రి ఆకాశరాజు అవనాక్షమ్మను కొలిచేవారు. వేటకై వచ్చిన వెంకన్న పద్మావతీ అమ్మవారిని మోహించి నారాయణవనంలో వివాహమాడినట్లు వరాహపురాణం చెబుతోంది. ఈ సందర్భంగా అవనాక్షమ్మ ఆలయంలో పద్మావతీ అమ్మవారు గౌరీపూజ చేశారని, వివాహం అనంతరం కల్యాణ వెంకన్న పద్మావతీ అమ్మవారితో కలిసి అవనాక్షమ్మను దర్శించుకుని కొలిచినట్లు ఇతిహాసాలు చెబుతున్నాయి. ఆలయంలో అమ్మవారికి తమిళ ఆవణి నెలలో 15 రోజుల పాటు జాత్తరను, శరన్నవరాత్రుల్లో 10 రోజుల పాటు ఉత్సవాలను టీటీడీ నిర్వహిస్తోంది.